

దొంగలు బాబోయ్

ఇటీవల జిల్లాలో చోరీలు పెరిగాయి. కదిరి, పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల్లో దొంగలు తాళం వేసిన ఇళ్లలో దూరి దొరికినంత దోచుకుపోయారు. 8లో



టమాట కిలో రూ.10


కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4.50, సరాసరి రూ.7 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.9°/22.1°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

రేపు మడకశిరకు జవహర్‌రెడ్డి



మడకశిర: ప్రకృతి సేద్యంతో సాగుచేసిన పంటల పరిశీలన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్‌ఎఫ్) డీపీఎం లక్ష్మానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు రొళ్ల చేరుకోనున్న ఆయన... రైతులు నాగరాజు, హనుమంతు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన వివిధ పంటలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం మడకశిర మండలంలోని నీలకంఠాపురానికి చేరుకుని రైతులు అనిత లక్ష్మి, మోహన్‌దాస్ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పలు రకాల పంటను పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ఇక్కడి నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళతారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ వైద్యుల కమిటీ నియామకం

- జిల్లా కమిటీలో 17 మందికి చోటు



సాక్షి, పుట్టపర్తి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల కమిటీ నియామకాలు చేపడుతోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం కమిటీని ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా కమిటీలో ధర్మవరం, హిందూపురం, పెనుకొండకు చెందిన 17 మంది డాక్టర్లకు చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ డాక్టర్ల వింగ్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా టి.సూర్యనారాయణరెడ్డి (ధర్మవరం), ఉపాధ్యక్షులుగా బి.వెంకటరామిరెడ్డి (ధర్మవరం), సత్యనారాయణ (ధర్మవరం), ప్రధాన కార్యదర్శులుగా ఎం.రఘునాథబాబు (ధర్మవరం), ఎస్.దివ్య (ధర్మవరం), కిరణ్‌కుమార్ (ధర్మవరం), ఉమామహేశ్వరి (ధర్మవరం), కార్యదర్శులుగా కె.అర్జున్‌రెడ్డి (ధర్మవరం), నారప్ప చౌదరి (ధర్మవరం), సుబాన్ (ధర్మవరం), బి.రఘునాథరెడ్డి (ధర్మవరం), సంయుక్త కార్యదర్శులుగా మల్లికార్జున (ధర్మవరం), విజయ్‌కుమార్ (హిందూపురం), టి.బద్రీనాథ్ (ధర్మవరం), టి.రఘురామ్ (పెనుకొండ), పి.జగన్నాథ్ (ధర్మవరం), టి.హరికృష్ణ (ధర్మవరం)ను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీలోనూ నలుగురు జిల్లా వాసులకు చోటు దక్కింది. జోనల్ ఇన్‌చార్జ్(జోన్-8)గా డాక్టర్ డీవీ నాగేంద్రకుమార్‌రెడ్డిని నియమించారు. అలాగే రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ మధురాపురం అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ బొగ్గు సురేష్, డాక్టర్ యెన్నం సంధ్యను నియమించారు.

'ఎంపీడీఓపై తప్పుడు రాతలు సహించం'

ముదిగుబ్బ: బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీడీఓ విజయలక్ష్మిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ముదిగుబ్బ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిందనే కారణంతోనే ఆమెపై ఓ పచ్చ పత్రికలో విషం కక్కారని దుయ్యబట్టారు. రాజకీయ ప్రయోజనాల కోసం కథనాలు రాస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తాడిమర్రిలో విధులు నిర్వహిస్తూనే ముదిగుబ్బకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలక్ష్మి సమర్థవంతంగా విధులను నిర్వహిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ముదిగుబ్బ ఎంపీడీఓగా శ్రీకాంత్ చౌదరిని నియమించినప్పటికి ఆయనను రానివ్వకుండా చేస్తున్నారనేది అబద్ధమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీపైన, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపైన అసత్య కథనాలు రాస్తే తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.





గాండ్లపెంట మండలం కటారుపల్లి శిబిరంలో కేస్‌షీట్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, మడకశిరలో మందులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, అమడగూరులో రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఆరోగ్య సురక్ష.. జనరక్ష!

- జిల్లా వ్యాప్తంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందిన ప్రజలు
- తొలిరోజు 14,433 మందికి వైద్య సేవలు
- 246 మందిని శస్త్ర చికిత్సల కోసం రెఫర్ చేసిన వైద్యులు
- పరిగిలో వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ అరుణ్ బాబు
- ఆయా నియోజకవర్గాల్లో వైద్య శిబిరాలను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు



పరిగి: సురక్ష శిబిరంలో రోగుల కేస్‌షీట్‌లో నమోదు చేసిన వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: జగనన్న ఆరోగ్య సురక్ష...జనానికి రక్షలా మారింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నగరాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి గ్రామంలోనే స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలందాయి. జనరల్ మెడిసిన్, స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్ వైద్యులతో పాటు మరో ఇద్దరు సివిల్ సర్జన్లు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించారు. 53 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేయడంతో నిరుపేద రోగులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల చెంతకే వైద్యం తీసుకువచ్చే క్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కు శ్రీకారం చుట్టగా.. తొలిరోజు శనివారం జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహించారు.

తొలిరోజు 14,433 మందికి వైద్యసేవలు..

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా తొలిరోజు శనివారం జిల్లాలోని 32 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య శిబిరాల గురించి ముందుగానే ప్రకటించడం వల్ల ఉదయమే జనం భారీగా తరలివచ్చారు. దీంతో అధికారులు స్త్రీ, పురుషులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 104 వాహనాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ల్యాబ్‌లలో రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందించారు. ఇద్దరు స్పెషలిస్ట్‌లు, ఇద్దరు సివిల్ సర్జన్లు బృందంగా రోగులకు స్క్రీనింగ్ నిర్వహించారు. తొలి రోజు 14,433 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించారు. వీరందరికీ అవసరమైన మందులూ ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించిన 246 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్డియాలజీ, ఆర్థో, గైనకాలజీ, ఆప్తమాలజీ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్‌లు వైద్య శిబిరాలలో పాల్గొన్నారు. ప్రతి వైద్య శిబిరం వద్ద కేస్ షీట్ కౌంటర్, స్పాట్ సర్వీస్ సెంటర్, హెల్ప్‌డెస్క్ కౌంటర్, పరీక్షా కేంద్రాలు, వైద్యుల గదులు, మందుల పంపిణీ కౌంటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చంటి పిల్లలు, మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. శిబిరాలకు వచ్చిన రోగులతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆరోగ్యశ్రీ యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించారు.

వైద్య శిబిరాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు..

జిల్లాలోని 32 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

- పుట్టపర్తి నియోజకవర్గంలోని కొండకమర్లలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కదిరి నియోజవర్గం మూర్తిపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, మడకశిర అర్బన్ విలేజ్ క్లినిక్‌లో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, పెనుకొండ నియోజకవర్గం పరిగి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ ప్రారంభించారు. సురక్ష శిబిరాలకు వచ్చిన ప్రజలతో వైద్య సేవల గురించి ఆరా తీశారు.
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' స్టేట్ కోఆర్డినేటర్ శివశంకర్, కలెక్టర్ అరుణ్‌బాబు పరిగి-2లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.ఎస్వీ కృష్ణారెడ్డి జిల్లాలోని పలు వైద్య శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లపై రోగులు, అధికారులతో ఆరా తీశారు.

45 రోజుల పాటు వైద్య శిబిరాలు..

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 45 రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల పట్ల చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు.



మడకశిరలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్



మడకశిర: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఓ వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యురాలు



శిబిరంలో ఏర్పాటు చేసిన రక్త పరీక్షల కేంద్రం



ఓ మహిళకు మందులు అందజేస్తున్న ఫార్మసిస్టులు

సురక్షతో మెరుగైన వైద్యసేవలు

- పరిగి వైద్య శిబిరంలో ఎమ్మెల్యే శంకరనారాయణ, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ మంగమ్మ

పరిగి: 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పరిగి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ... సచివాలయ వ్యవస్థతో సీఎం జగన్ గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ క్రమంలోనే పల్లె ముంగిటే వైద్యం అందేలా చర్యలు చేపట్టారన్నారు. ఆరోగ్యశ్రీతో ఎందరికో ప్రాణాలు పోశారని, ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థతో ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి సేవలందిస్తున్నారన్నారు. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా చూస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం నిరుపేదలకు వైద్య సేవలను చేరువ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ...ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడిచే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఆరోగ్య ప్రదాతగా దివంగత నేత వైఎస్సార్ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి, అభివృద్ధితో పాటూ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి..

స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు ప్రభుత్వం చేరువ చేసిందని, ప్రభుత్వ లక్ష్యసాధనే ధ్యేయంగా అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపి శస్త్ర చికిత్సలు చేయిస్తామని, అవసరమై మందులూ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించుకున్న వారి ఓపీ షీట్‌తో పాటూ ఆరోగ్య సురక్ష కార్యక్రమ బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖ స్టాల్‌తో పాటూ అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరిశీలించారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ శివశంకర్, జిల్లా నోడల్ అధికారి కుల్లాయప్పనాయక్, స్పెషలాఫీసర్ ప్రసాద్‌రావు, ఎంపీడీఓ సరస్వతి, తహసీల్దారు సౌజన్య లక్ష్మి, ఎంపీపీ సవిత, సర్పంచ్ లక్ష్మీదేవి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ సురేష్‌కుమార్, సీహెచ్‌ఓ వన్నప్ప, జెడ్పీటీసీ శ్రీరామప్ప, వైస్ ఎంపీపీ వేదవతి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- మృతి చెందిన పోలీసుల కుటుంబీకులకు ఎస్పీ భరోసా



కిరణ్‌కుమార్ భార్య అంజలీకుమారికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీసుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ (ఎంటీ విభాగం) కుటుంబీకులు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్‌కుమార్ భార్య అంజలీకుమారికి కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. పోలీసు మృతుల కుటుంబీకులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేరుగా తనను కలవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సూపరింటెండెంట్ సరస్వతితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు సీఐ కరుణాకర్

పుట్టపర్తి టౌన్: పెనుకొండ సీఐ కరుణాకర్‌ను వీఆర్‌కు పంపుతూ శనివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాకర్ స్థానంలో అనంతపురం రేంజ్‌లో పనిచేస్తున్న పి.రాజా రమేష్‌ను పెనుకొండ సీఐగా బదిలీ చేశారు. అలాగే ఇటీవలే సీఐగా పదోన్నతి పొందిన హేమంత్‌కుమార్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

సివిల్ పంచాయితీతో చర్యలు..!

సీఐ కరుణాకర్ ఇటీవల పెనుకొండ మండలం పెదకోట్ల గ్రామంలో ఓ సివిల్ పంచాయితీలో తలదూర్చడంతో బాధితులు స్పందనలో ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శాఖాపరమైన విచారణ చేయించిన ఎస్పీ నివేదికను రేంజ్ డీఐజీకి పంపారు. దీంతో డీఐజీ అమ్మిరెడ్డి కరుణాకర్‌ను వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ..

జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెనుకొండ ఎస్‌ఐ జి. రమేష్‌ను 'కియా' పోలీస్టేషన్‌కు, హిందూపురం ట్రాఫిక్ పోలీస్టేషన్ ఎస్‌ఐ అబ్దుల్ కలాంను హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఐదో ఏడాదీ కృష్ణమ్మ పరుగులు



కొత్తచెరువు వద్ద ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పలు చెరువులు నింపడానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు వరుసగా 5వ ఏడాది కూడా పరుగులు పెడుతున్నాయి. గతంలో కృష్ణా జలాలతో చెరువులు నింపినా కేవలం చేపల పెంపకానికి వినియోగించేవారు. పంటలకు వదిలే వారు కాదు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే చేపల పెంపకంతో పాటు చెరువు ఆయకట్టు భూములకు కూడా నీటిని వదులడం ప్రారంభించారు. దీంతో పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పంటల సాగు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. రబీ సీజన్ ప్రారంభంలోనే కృష్ణా జలాలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తి నియోజకవర్గానికి గతంలోనే ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి 3 టీఎంసీల నికర జలాలు సాధించి జీఓ తీసుకురావడం తెలిసిందే. దీంతో భారీ చెరువులైన బుక్కపట్నం, మారాల రిజర్వాయర్, చెర్లోపల్లి మీదుగా కదిరి, అక్కడి నుంచి కుప్పం తరలివెళ్తున్నాయి.

3, 4 తేదీల్లో ఐఈఆర్పీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య) విభాగంలో ఖాళీగా ఉన్న రీసోర్స్ పర్సన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 3, 4 తేదీల్లో పరిశీలించనున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) వి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఆర్, హెచ్‌ఐ/వీఐ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లాకు చేరినట్లు తెలిపారు. ఎంఆర్ అభ్యర్థుల సర్టిఫికెట్లను 3న, హెచ్‌ఐ/వీఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను 4న పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లను రెండుసెట్లు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంఆర్ పోస్టులకు 144 మంది, వీఐ/హెచ్‌ఐ పోస్టులకు 120 దరఖాస్తులు వచ్చినట్లు ఏపీసీ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు 174 దరఖాస్తులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు మొత్తం 174 దరఖాస్తులు అందినట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తెలిపారు. ఈ నెల 29వ తేదీతో దరఖాస్తుకు గడువు ముగిసిందని, 5 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 18 దరఖాస్తులు, 5 మినీ కార్యకర్తల పోస్టులకు 15 దరఖాస్తులు, 55 సహాయకుల పోస్టులకు 141 దరఖాస్తులు అందాయన్నారు. 8 సెంటర్లకు దరఖాస్తులు అందలేదన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులను గుర్తించి కాల్ లెటర్లు పంపుతామన్నారు. పోస్టుల భర్తీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఉద్యోగాలిప్పిస్తామని చెప్పే మధ్యవర్తుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

క్లుప్తంగా

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: గుర్తింపు కార్డుల కోసం కళాకారులు ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేలాయుధం ఓ ప్రకటనలో కోరారు. కళాకారుల వివరాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యాలయానికి అక్టోబర్ 9లోగా పంపాల్సి ఉందన్నారు. ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేసి దరఖాస్తులను అక్టోబర్ 5లోపు పుట్టపర్తి చిత్రావతి రోడ్డులోని తమ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

రామగిరి ఎంపీపీ రాజీనామా

రాప్తాడురూరల్: రామగిరి మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్షురాలు ఎనమల సుజాత తన పదవికి రాజీనామా చేశారు. శనివారం అనంతపురంలో జాయింట్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశానని, ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగతానని సుజాత స్పష్టం చేశారు.

దొంగలు బాబోయ్..

- కదిరి పట్టణం అడపాల వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాద్‌కు ఓ ఆపరేషన్ నిమిత్తం కుటుంబమంతా వారం క్రితం బెంగళూరు వెళ్లింది. వారి ఇంటి పక్కన ఉంటున్న చంద్రశేఖర్ దంపతులు కూడా అదే రోజు పులివెందుల పట్టణంలో ఉన్న తమ కుమార్తెను చూడడానికి ఇంటికి తాళం వేసి వెళ్లారు. వారి ఎదురింట్లో ఉండే గుణశేఖర్ కూడా ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి షిర్డీ దర్శనార్థం వెళ్లారు. దొంగలు ఆ మూడు ఇళ్ల తాళాలు పగులకొట్టి 42 తులాల బంగారం, రూ 2.35 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకుని బాధితులు లబోదిబోమన్నారు.
- పెనుకొండలోని మడకశిర రహదారి ప్రాంతంలో నివాసం ఉంటున్న బేల్దారి నరేష్ నాలుగు రోజుల క్రితం పని నిమిత్తం వెళ్లారు.అతని భార్య కూలి పనుల కోసం వెళ్లింది. ఈ క్రమంలో దొంగలు ఆ ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 15 తులాల బంగారం, రూ. 40 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- పుట్టపర్తి పట్టణంలోని జానకీరామయ్య కల్యాణ మండపం సమీపంలో గౌసియా అనే మహిళ చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె దుకాణంలో కూల్ డ్రింక్ కొనుగోలు చేశాడు. స్వీట్ కావాలని అడగడంతో బాక్స్‌లో నుంచి ఇచ్చేందుకు ఆమె పైకి లేచింది. ఈ క్రమంలో సదరు వ్యక్తి ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు.

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై కరువైన అవగాహన
- పట్టించుకోని పోలీసులు



నల్లచెరువులో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించడానికి వెళ్తున్న క్లూస్ టీం (ఫైల్)



కదిరిలో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

పుట్టపర్తి టౌన్: జిల్లాలో చోరీ ఘటనలు పెరిగిపోతున్నాయి. పుట్టపర్తి, కదిరి, పెనుకొండ ప్రాంతాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము పోగొట్టుకొన్నామని బాధితులు లబోదిబోమంటున్నారు.

పర్యవేక్షణ లోపంతోనే..

పోలీసుల పర్యవేక్షణ కరువవడంతోనే దొంగలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. పోలీసులు అనుమానితులపై నిఘా వేయడం, గొడవలు జరగకుండా చూడడం, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా గస్తీలు నిర్వహించడం చేయాలి. అయితే, జిల్లాలో ఎక్కడా ఇలా జరగడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. తూతూ మంత్రంగా సాయంత్రం వేళ రోడ్లపైకి వచ్చి వాహనాలు తనిఖీ చేసి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవగాహనతో అడ్డుకట్ట..

పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంపై ప్రజలకు అవగాహన ఉండడం లేదు. వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే వారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఎవరైనా సదరు ఇంటి తలుపు పగులగొడితే పోలీసుస్టేషన్‌కు సమాచారం వెళ్లేలా ఎల్‌హెచ్‌ఎంఎస్‌కు రూపకల్పన చేశారు. అయితే, ఈ విధానంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో దొంగలు సులువుగా తమ పని చేసుకుపోతున్నారు. పర్యవేక్షణ మెరుగు పరచడం, ప్రజల్లో చైతన్యం పెంచడం ద్వారా దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు చెబుతున్నారు.

జిల్లాలో జనవరి నుంచి జరిగిన దొంగతనాల వివరాలు..	
కదిరి సబ్‌డివిజన్	30
పుట్టపర్తి సబ్‌డివిజన్	20
ధర్మవరం సబ్‌డివిజన్	58
హిందూపురం సబ్‌డివిజన్	52
పెనుకొండ సబ్ డివిజన్	99

ఏడు నిమిషాల వ్యవధిలో 'దిశ' రక్షణ

పుట్లూరు: సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశ రక్షణ వ్యవస్థ నిమిషాల వ్యవధిలోనే ఓ కుటుంబాన్ని కాపాడింది. వివరాలు... స్థల వివాదం నేపథ్యంలో శుక్రవారం పుట్లూరు మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కొండారెడ్డి, రత్నమ్మ, లక్ష్మిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత సాంబశివారెడ్డితో పాటు మరో ఏడుగురు దాడికి తెగబడిన విషయం తెలిసిందే. దౌర్జన్యంగా వారందరూ ఇంట్లోకి చొరబడి దాడికి తెగబడుతుండగా అప్రమత్తమైన మహిళలు వెంటనే దిశ యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కారు. సమాచారం అందుకున్న పోలీసులు కేవలం ఏడు నిమిషాల వ్యవధిలోనే గ్రామానికి చేరుకుని బాధితులకు రక్షణగా నిలిచారు. అప్పటికే దాడిలో గాయపడిన లక్ష్మి, కొండారెడ్డి, రత్నమ్మను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంబ శివారెడ్డి, తిప్పారెడ్డితో పాటు మరో ఆరుగురిపై ఐపీసీ 324, 452, 34 సెక్షన్ల కిందకేసు నమోదు చేసి, శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దిశ యాప్‌ను అమలు చేసి ఆపత్కాలంలో తమ ప్రాణాలు కాపాడేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రక్షణ కల్పించిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మవరంవాసి కిడ్నాప్



రోదిస్తున్న భార్యాపిల్లలు, (ఇన్‌సెట్) పాపన్న అలియాస్ వెంకటేష్

ధర్మవరం రూరల్: పట్టణంలోని గీతానగర్‌కు చెందిన పాపన్న అలియాస్ వెంకటేష్ శుక్రవారం రాత్రి కిడ్నాప్‌నకు గురయ్యాడు. పోలీసులు, వెంకటేష్ భార్య గంగ తెలిపిన మేరకు.. గీతానగర్‌కు చెందిన పాపన్న పదేళ్ల క్రితం చెన్నైకి వెళ్లి స్థిరపడ్డాడు. అక్కడి ఫైనాన్స్‌దారులతో పరిచయాల ద్వారా తెలుగు వారికి రుణాలు ఇప్పించి వసూలు చేసేవాడు. రుణాలు సక్రమంగా వసూలు కాకపోవడంతో ఫైనాన్స్‌దారుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది. దీంతో మూడు నెలల క్రితం తిరిగి ధర్మవరం వచ్చాడు. శుక్రవారం తన బైకును స్థానిక దిమ్మెల్ సెంటర్‌లో మెకానిక్ వద్ద రిపేరికి ఇచ్చి టీస్టాల్ వద్ద ఉన్నాడు. ఈ క్రమంలోనే చెన్నైకు చెందిన ఫైనాన్స్‌దారులు వల్లీమోహన్, మురగన్, గోపీనాథ్‌తో పాటు మరొకరు ఇన్నోవా వాహనంలో అక్కడికి వచ్చి పాపన్నను వాహనంలోకి బలవంతంగా ఎక్కించారు. స్థానికులు వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కదిరిలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులను పిలుచుకొని కదిరి టోల్ ప్లాజ్ వద్ద కాపు కాచారు. ఈ క్రమంలో కిడ్నాప్‌దారులలో ఒకరు బయటకు దూకి పారిపోయేందుకు యత్నించగా, వాహనం ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. పారిపోతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. కదిరి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. శనివారం పాపన్న భార్య ధర్మవరం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. తమకు చిక్కిన వ్యక్తిని వెంటబెట్టుకొని నిందితులను పట్టుకునేందుకు సీఐ సుబ్రమణ్యం తన బృందంతో కలిసి చెన్నై వెళ్లారు.

9 కేజీల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణాపై నెల్లూరు జిల్లా నవాబుపేట పోలీసులు దాడి చేశారు. 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. శనివారం రాత్రి నవాబుపేట పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. ముదిగుబ్బ మండలం కొండగట్టుపల్లికి చెందిన షావలి డ్రైవర్. విధి నిర్వహణలో భాగంగా తరచూ ఒడిశాకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గంజాయికి బానిసయ్యాడు. సులభంగా నగదు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను ప్రారంభించాడు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి నెల్లూరు నగరం, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. వైఎస్సార్ జిల్లా తేరేనామ్‌పల్లిలో నివాసం ఉంటున్న తన అక్క సబీరా, నెల్లూరులోని మూలాపేటలో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న షేక్ ఫైరజ్, మరో వ్యక్తిని వ్యాపారంలో భాగస్వాముల్ని చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. శనివారం షావలి, సబీరా, ఫైరజ్ గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం బాబికి అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కలిసి ప్రశాంతినగర్ జంక్షన్ (జాతీయ రహదారి) వద్ద మాటు వేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువచేసే 9 కేజీల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. ఒడిశాలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరు, అనంతపురం, కడప జిల్లాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు వెల్లడించడంతో అరెస్ట్ చేశారు. నెల్లూరులోని కొందరు గంజాయి విక్రేతల పేర్లు వెల్లడించడంతో వారి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఎం బాబి, ఎస్సైలు బీ శివ ప్రకాష్, ఎస్‌ఏ రెహమాన్, సిబ్బంది జీ వెంకటేశ్వర్లు, ఆర్వీ రత్నం, ఎస్ సురేంద్రబాబు, బీ మోహన్‌బాబు, ఎం వేణు, జీ మస్తానయ్య, డీ శ్రీనిజను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎం బాబి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హుండీలో నగదు అపహరణపై విచారణ



ఆలయంలో చోరీ జరిగిన హుండీని పరిశీలిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇటీవల చోటు చేసుకున్న హుండీలో నగదు అపహరణ ఘటనపై దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ విజయ్‌సాగర్‌బాబు, కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణారెడ్డి ఈ నెల 17న హుండీ నుంచి నగదు చోరీ చేస్తూ నిఘా కెమెరాలకు పట్టుబడిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ ఘటనపై ఇప్పటికే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా ఆలయ అధికారుల నివేదిక మేరకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ద్విసభ్య కమిటీ ఉన్నత స్థాయి విచారణ చేపట్టింది. చోరీ జరిగిన హుండీని, సీసీ ఫుటేజీలను ద్విసభ్య కమిటీ సభ్యులు పరిశీలించారు. తర్వాత గంగా నిలయం సమీపంలోని అతిథి గృహంలో ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ ధనుంజయ, ఇతర సిబ్బందిని విచారించారు. సాయంత్రం మరోసారి ఆలయ ఈఓ కార్యాలయంలోనూ విచారణ కొనసాగించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. హుండీలో నగదు అపహరణ ఘటనపై జరిపిన విచారణకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

చెన్నైకు రెండు ఏసీ బస్సులు

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రం నుంచి తిరుపతి మీదుగా చెన్నైకు ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రెండు ఏసీ బస్సులు నడపనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రోజూ రాత్రి 9.30 గంటలకు (సర్వీస్ నెంబర్ 6616) అనంతపురం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. తిరిగి చెన్నై నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు అనంతపురానికి చేరుకుంటుంది. పెద్దలకు రూ. 950, పిల్లలకు రూ.740 చొప్పున ఛార్జీ వసూలు చేస్తారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు.

ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు కేంద్రం మేనేజర్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతకు యాంబర్ ప్రాజెక్టు కింద కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ సేల్స్ అసోసియేట్స్, జాబ్‌రోల్స్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు అనంతపురంలోని రాజురోడ్డులో ఉన్న ఎక్సల్స్ లర్నింగ్ సొల్యూషన్ కార్యాలయంలో నేరుగా లేదా 93981 54460, 75696 59964లో సంప్రదించవచ్చు.

భార్యను హతమార్చిన భర్త



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి: కట్టుకున్న భార్యను భర్త హతమార్చాడు. కోనకణ్వాశ్రమం వద్ద జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు.. మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన పూజారి నరసింహులు, మంజుల (30) దంపతులు. కొంత కాలంగా మంజుల అనారోగ్యంతో బాధపడుతోంది. నరసింహులు దీన్ని అవమానంగా భావించాడు. రెండో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు భార్య అడ్డుగా నిలిచిందని, ఆమెను అంతమొందించాలని భావించాడు. మూడు రోజుల క్రితం భార్యను బైకుపై ఎక్కించుకుని కోనకణ్వాశ్రమం వద్దకు తీసుకువెళ్లి గొంతు నులుమి హత్య చేశాడు. అక్కడే కాలువలో పడేసి ఇంటికి వచ్చాడు. శనివారం అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన వారు న్యామద్దల గ్రామవాసిగా గుర్తించారు. మృతురాలి తల్లి అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఔను అది హత్యే!

- హెచ్చెల్సీలో కొట్టుకు వచ్చిన మృతదేహం ఆచూకీ లభ్యం
- హతుడిని బళ్లారి వాసిగా గుర్తించిన పోలీసులు
- వివాహేతర సంబంధం కారణంగానే హత్య?



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు (ఇన్‌సెట్) వినోజ్ (ఫైల్)

బొమ్మనహాళ్: హెచ్చెల్సీలో కొట్టుకు వచ్చిన మృతదేహం ఆచూకీ లభ్యమైంది. యువకుడిని హత్య చేసి, కాళ్లుచేతులు కట్టేసి హెచ్చెల్సీలో పడేసినట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు శివారులోని హెచ్చెల్సీ 119/500 కిలోమీటర్ వద్ద శుక్రవారం ఓ యువకుడి మృతదేహం కొట్టుకు వచ్చిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్, ఎస్‌ఐ శివ... శనివారం ఉదయం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. హత్య చేసి కాళ్లు, చేతులు తాడుతో కట్టేసి హెచ్చెల్సీ ప్రధాన కాలువలో పడేసినట్లుగా నిర్ధారించారు. లభ్యమైన ఆధారాలను బట్టి హతుడిని బళ్లారిలోని మేదార్ కేతయ్య నగర్ (ఎమ్‌కే నగర్)కు చెందిన ఎం.వినోజ్ (30)గా గుర్తించారు. సండూరు వద్ద ఎస్‌ఎండీసీ కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తుండేవాడు. వివాహేతర సంబంధాల కారణంగానే హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. వీఆర్వో కుళ్లాయి స్వామి నుంచి స్వీకరించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బీఈడీ (దూరవిద్య) రెండో సంవత్సరం ఫలితాలు శనివారం ఆ వర్సిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 338 మంది పరీక్ష రాయగా 325 (96.15 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 21వ తేదీ వరకూ గడువునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీ విజయపరంపర

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సబ్ జూనియర్ బాలుర నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ఏపీ జట్టు విజయ పరంపరను కొనసాగిస్తోంది. శనివారం లక్షద్వీప్‌తో తలపడిన ఏపీ జట్టు 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. జట్టులో సాత్విక్, సాదిక్ వలి, కియాన్స్ చెరో గోల్ సాధించారు. హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడిన సిక్కిం జట్టు 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. త్రిపురపై ఏకంగా 11 గోల్స్‌తో బిహార్ జట్టు విజయకేతనం ఎగురువేసింది. ఈ మ్యాచ్‌లో త్రిపుర జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. అలాగే అండమాన్‌నికోబార్‌పై 9–0 గోల్స్ తేడాతో ఉత్తరాఖండ్ జట్టు విజయం సాధించింది.